

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 93 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 04, మార్చి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# హద్దులు దాటిన హోలీ !












మనుషుల వికృత రూపాలు ఒక్కసారిగా బయటపడ్డాయి

ఆనందాలు కాస్త అపస్మృతీల వరకు దారితీసాయి

మద్యం కల్తీ అయ్యిందా మనుషులే కల్తీ అవుతున్నారా

హోలీ సంబరాల మధ్య విచ్చలవిడిగా వికృతి చేష్టలు

ఆడ మగ తేడా లేకుండా హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారు

"చీ" గుడ్లు కుట్టుకోని సంబర పడుతున్న యువత

పోలీస్ ఉన్నతాధికారుల కాంక్షలు బేఖతారు చేస్తున్న యువత

సాంప్రదాయాలు కాస్త చెడు వ్యసనాలుగా మారిపోతున్నాయి

ఎర్రిగా తాగుడుకు అలవాటు పడి ఎగిరెగిరి గంతులు వేస్తున్నారు

మద్యం మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా పోతుంది

డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

హోలీ పండుగ వికృత చేష్టలు యువత ప్రాణాలను తీస్తుందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. సాంప్రదాయాల మధ్య ఆనందభరితంగా జరుపుకోవాల్సిన హోలీ పండుగ వికృత చేష్టల మధ్య తాగుబోతుల అలజడిల మధ్య విపరీతమైన మద్యం సేవిస్తూ వాహనాలపై రోడ్లమీద పిచ్చికుక్కల కన్నా హీనంగా ప్రవర్తించే స్థితికి దిగజారిపోవడం నిజంగా చెప్పాలంటే ప్రకృతిని అన్ని కోణాల్లో కల్మషం చేసే విధంగా ప్రయత్నాలు జరిగాయన్నారు. సంస్కృతి సాంప్రదాయాల మధ్య సాధారణ రంగులతో హోలీ వేడుకలను జరుపుకుంటూ బ్యాండ్ మేళాలతో వాయిద్యాలతో సంబరాలు జరుపుకోవడమే కాకుండా ఆనందకరమైన చిందులు వేస్తూ...

- మిగతా 2లో..

## సీపీఎం సీనియర్ నేత తమ్మినేనిపై వేటు


అభిశంసించిన కేంద్ర కమిటీ!

రాష్ట్ర కార్యదర్శి ఎన్నికలో లాబీయింగ్‌కు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణ

తమ్మినేనితో పాటు మరో ఇద్దరు నేతలపైనా క్రమశిక్షణ చర్యలు

ఇచ్చిన వివరణలో ఆత్మవిమర్శ లేదని అధిష్ఠానం అసంతృప్తి

తెలంగాణ సీపీఎంలో వర్గపోరు తీవ్రస్థాయికి చేరిందని వెల్లడి



2

## జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో దారుణం..



శవాన్ని పీక్కుతిన్న కుక్క

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో దారుణ ఘటన

మృతదేహాన్ని పీక్కుతిన్న వీధి కుక్క.. వైరలైన వీడియో

తాళం చెడిపోవడం వల్లే కుక్క లోపలికి వచ్చిందన్న సూపరింటెండెంట్

సిబ్బంది నిర్లక్ష్యంపై మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

2

## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

2

## ఢిల్లీ కేసులో క్లీన్‌చిట్.. తిరుమల యాత్రకు సిద్ధమైన కల్వకుంట్ల కవిత

5న అలిపిరి మెట్ల మార్గం ద్వారా ద కాలినడకన కొండపైకి

6న తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కుల చెల్లింపు

తిరుమల పర్యటన తర్వాత రాజకీయ భవిష్యత్‌పై ప్రకటన చేసే అవకాశం

రెండు నెలల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఇప్పటికే ప్రకటన

2





## తెలంగాణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

భారతీయ సంప్రదాయంలో రంగుల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్న కేసీఆర్

ఈ పండుగ జీవితంలో నూతనత్వానికి సంకేతమని ట్వీట్

ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష

2

## సీపీఎం సీనియర్ నేత తమ్మినేనిపై వేటు

**అభిశంసించిన కేంద్ర కమిటీ!**
**రాష్ట్ర కార్యదర్శి ఎన్నికలో లాబీయింగ్‌కు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణ**
**తమ్మినేనితో పాటు మరో ఇద్దరు నేతలపైనా క్రమశిక్షణ చర్యలు**
**ఇచ్చిన వివరణలో ఆత్మవిమర్శ లేదని అధిష్ఠానం అసంతృప్తి**
**తెలంగాణ సీపీఎంలో వర్గపోరు తీవ్రస్థాయికి చేరిందని వెల్లడి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు (ఎవఅంబతీవ) అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది. రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది. సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

## జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో దారుణం..

**శవాన్ని పీక్కుతిన్న కుక్క**
**జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో దారుణ ఘటన**
**మృతదేహాన్ని పీక్కుతిన్న వీధి కుక్క.. వైరలైన వీడియో**
**తాళం చెడిపోవడం వల్లే కుక్క లోపలికి వచ్చిందన్న సూపరింటెండెంట్**
**సిబ్బంది నిర్లక్ష్యంపై మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన**

మహబూబ్‌నగర్, జై భీమ్ న్యూస్

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. మార్చురీ గదిలో ఉంచిన ఓ మృతదేహాన్ని వీధి కుక్క పీక్కుతింటున్న దృశ్యాలు తీవ్ర కలకలం రేపాయి. అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే... జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన లారీ డ్రైవర్ భీమేశ్వర్ శనివారం నుంచి అదృశ్యమయ్యాడు. సోమవారం స్థానిక చెరువులో అతని మృతదేహం లభించడంతో పోలీసులు దాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అయితే, మార్చురీలో భద్రపరచాల్సిన శవాన్ని సిబ్బంది నేలపైనే ఉంచారు. ఈ క్రమంలో లోపలికి ప్రవేశించిన ఓ వీధి కుక్క, మృతదేహాన్ని పీక్కుతినడం ప్రారంభించింది. ఈ దృశ్యాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ, మార్చురీ గది తాళం చెడిపోయిందని, దాన్ని మరమ్మతు చేయించడానికి సెక్యూరిటీ గార్డు బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగిందని వివరణ ఇచ్చారు. పోస్టుమార్టం కోసం సిబ్బంది లోపలికి వెళ్తున్నప్పుడు వారి వెంటే కుక్క కూడా ప్రవేశించిందని, వెంటనే దాన్ని తరిమేశామని తెలిపారు. ఈ దారుణ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్పందిస్తూ, ఇది అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కాగా, జడ్చర్ల ఆసుపత్రిని 100 పడకలకు పెంచినప్పటికీ, కొత్త భవనంలో మార్చురీ సౌకర్యం లేకపోవడంతో పాత గదిలోనే పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీ కేసులో క్లీన్‌చిట్.. తిరుమల యాత్రకు సిద్ధమైన కల్వకుంట్ల కవిత

**5న అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన కొండపైకి**
**6న తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కుల చెల్లింపు**
**తిరుమల పర్యటన తర్వాత రాజకీయ భవిష్యత్‌పై ప్రకటన చేసే అవకాశం**
**రెండు నెలల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఇప్పటికే ప్రకటన**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ కేసు నుంచి విముక్తి లభించడంతో స్వామివారికి మొక్కు చెల్లించుకోవాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కాలినడకన అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమల కొండకు చేరుకోవాలని సంకల్పించారు. ఆమె పర్యటన వివరాలను సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 5వ తేదీన కవిత తిరుపతికి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం అలిపిరి నుంచి కాలినడకన కొండపైకి వెళ్లనున్నారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, ఆ మరుసటి రోజు అంటే 6వ తేదీన ఉదయం శ్రీవారిని దర్శించుకుని తన మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. సీబీఐ సరైన ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ కవితతో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి విముక్తుల్ని చేసింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు పెట్టారని నిందితులు ఆరోపించారు. కాగా, ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న కవిత దాదాపు 6 నెలల పాటు తీహార్ జైలులో ఉన్నారు. అయితే, కవిత తిరుమల పర్యటన కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితం కాదని, దీని వెనుక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆమె తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రానున్న రెండు నెలల్లో కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల్లో చురుగ్గా ఉంటున్న ఆమె, ఈ పర్యటన తర్వాత తన రాజకీయ కార్యాచరణను మరింత వేగవంతం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.


# హద్దులు దాటిన హోలీ

మొదటి పేజీ తరువాయి

అందరినీ కలుపుకొని గ్రూపు సమూహాలుగా ఏర్పడుతూ ఆనంద భరితంగా హోలీ సంబరాలను జరుపుకున్న సందర్భాలను చాలా తక్కువగా చూడగలమన్నారు.దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న హోలీ పండుగలో తెలుగు రాష్ట్రాల పోలీస్ అధికారులు అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలలో హోలీ పండుగను శ్రుతి మించి జరుపుకున్నట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని పత్రికా ప్రకటనలు చేస్తుండటమే కాకుండా అన్ని విధాలతో కూడిన సమాచారాన్ని సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు చేరవేసినప్పటికీని ఎనభై శాతం ప్రజలు హోలీ పండుగను సంస్కృతి సాంప్రదాయాలకు దూరంగా వికృత చేష్టలకు సమీపంగా జరుపుకొని హోలీ పండుగ విలువలను దిగజార్చారని ఎక్కడ చూసినా కల్తీ కలర్లతో హోలీ జరుపుకోవడమే కాకుండా "చీ"కిపోయిన గుడ్లను తలపై కొట్టుకుంటూ శరీర భాగాలపై రుద్దుకుంటూ అత్యంత దారుణంగా హోలీ పండుగను ఆడారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి అన్నారు.మంగళవారం ఉదయం 5 గంటల నుండి ప్రారంభమైన హోలీ సంబరాలు మధ్యాహ్నం వరకు జరుగుతూనే ఉన్నాయని కొన్నిచోట్ల డీజేలు పెట్టుకొని డాన్సులు వేస్తూ ఆనందపు కోలాహాలాల మధ్య హోలీ జరుపుకోవడం మరికొన్ని చోట్ల సాధారణమైన రంగులతో ఒకరికొకరు శుభాలు తెలుపుకుంటూ రంగులు చల్లుకుంటూ స్వచ్ఛమైన హోలీ ఆడారని వివరించారు. ఏ ప్రాంతంలో చూసిన యువత హద్దులు దాటి హోలీ ఆడారని తెలపడానికి ఏమాత్రం సందేహం లేదన్నారు.సామాన్య ప్రజలను మొదలుకొని పెద్దవాళ్ల వరకు యువత చేష్టల వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని విచ్చలవిడిగా మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నిలుపుదల చేస్తూ కేరింతలతో గట్టిగా అరుస్తూ ఒర్రుకుంటూ సమాజాన్ని హోలీ పండుగను ఎక్కిరింతల పాలు చేశారని తీవ్రంగా విమర్శించారు.గంజాయి మత్తులో కొంత శాతం యువత, మద్యం మత్తులో మరి కొంత శాతం యువత, వ్యసనాల మత్తులో ఇంకొంత శాతం యువత హోలీ పండుగ నామరూపాలను మార్చేశారని తీవ్రంగా విమర్శించారు.శాంతిభద్రతల విషయంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలీస్ శాఖ ఎక్కడ లేని శ్రమ పడ్డారని ప్రధానంగా చాలా సందర్భాల్లో చాలా చోట్ల యువత చేస్తున్న వికృతి చేష్టలను పోలీసులు దగ్గర ఉండి కట్టడి చేశారని హోలీ పండుగ సందర్భంగా కొట్టకూడదు అనే ఒక్క ఉద్దేశంతో వదిలేసారే తప్ప చాలా చోట్ల పోలీసు అధికారులు వాళ్ల కర్రలకు పదును పెట్టాల్సిన అవసరం ఏర్పడియుండెనన్నారు.ప్రైవేట్ హోస్టల్లో పరాకాష్టకు చేరిన హోలీ వేడుకలను చూసి సమాజం చీదరించుకున్నదని గుర్తు చేశారు.విద్యాసంస్థలలో హోలీ పండుగలు శృతిమించాయని తెలుపుతూ ప్రైవేట్ కళాశాలలో ప్రైవేటు యూనివర్సిటీలలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు హోలీ సంబరాలను వికృతంగా జరుపుకోవడమే కాకుండా వాటిని వీడియోల రూపంలో ఫోటోల రూపంలో సోషల్ మీడియాలో ఇన్స్టా అకౌంట్లలో పోస్టు చేస్తూ ఆనందపడ్డారన్నారు.కొన్నిచోట్ల యువత పెంటకుప్పల పైన రోడ్ల పక్కన ఏర్పడి ఉన్న డ్రైనేజీ బొందలలో పొర్లాడుతూ హోలీ సంబరాలు జరుపుకొని వాళ్ళ ఆనందాలను వ్యక్తపరచుకున్నారని తీవ్రంగా హేళన చేశారు.కొన్నిచోట్ల శాంతిభద్రతలను రక్షించే క్రమంలో పోలీస్ అధికారులు ఉన్నపాటుగా తల పట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఈ విధంగా మద్యం మత్తులో గంజాయి మత్తులో డ్రస్సుమందులో హోలీ పండుగను యువత ఆనందాలకు అనుకూగా మార్చుకొని ప్రతిష్టతో కూడిన హోలీ సంబరాలను ప్రకృతికి విరుద్ధంగా జరుపుకున్నారని గట్టిగా మందలించారు.హోలీ పండుగ సంబరాలతో మీ వర్గాల ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందించాల్సిన సందర్భంలో హోలీ వేడుకలు అంటేనే చిరాకు పుట్టే విధంగా పరిపరి విధాల ఆకతాయిల ఆటలకు కోరుకోవడమే కాకుండా మద్యం మత్తులో బరితెగించిన పనులు చేస్తూ హోలీ ఆటను కాస్త వికారకరంగా మార్చేస్తూ దద్దరిలే డీజే శబ్దాలతో సమాజాన్ని సౌండ్ పొల్యూషన్ గా మారుస్తూ సాదారన ప్రజలు భరించడానికి వీలు లేని విధంగా హోలీ వేడుకలను జరుపుకోవడం ఏదైతే ఉందో దాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వాలను పోలీసు అధికారులను కోరారు.ఇరు రాష్ట్రాల వ్యాప్తంగా వైన్స్ షాపులు రెస్టారెంట్ షాపుల ముందు లక్షల సంఖ్యలో యువత హోలీ సంబరాల పేరుమీద కనపర్చిన వికృత చేష్టలు అంతా ఇంతా కాదన్నారు.సభ్య సమాజం తలదించుకునేలా వాహనాలపై చిందులేస్తూ రోడ్ల మధ్య బైక్ రైడింగ్లతో తల్లిదండ్రుల విలువలను బజారునకీడ్చే పరిస్థితులను కొత్త పద్ధతి రూపంలో తెరలేపారని తీవ్రంగా హెచ్చరించారు.యువత క్రమశిక్షణతో నడుచుకునే పరిస్థితులను కలలోనైనా చూస్తామో లేదో తెలియదు గాని బరితెగింపు తనంలో భరించరాని చేష్టలు మాత్రం పక్కాగా కండ్లకు అద్దినట్టు కనిపిస్తుందన్నారు.కొన్నిచోట్ల యువత హోలీ సంబరాల మధ్య ప్రాణాలు తీసుకునే స్థాయికి పోయారని తీవ్రంగా మందలించారు.పరిస్థితులకు అనుగుణంగా సమాజానికి సానుకూలంగా హోలీ పండుగ జరుపుకోవాలగ నీ అలాంటి సంబరాలు కేవలం యువత భరితెగింపుతనం వల్ల హోలీ సంబరాల సాంప్రదాయాలు మంట కలిసిపోయాయి అన్నారు.తల్లిదండ్రులు విద్యాసంస్థల యాజమాన్యాలు కళాశాలల యాజమాన్యాలు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల యాజమాన్యాలతో పాటు అధికారులు అన్ని విశ్వవిద్యాలయాల ఉన్నత అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా యువతను కట్టడి చేయడం కోసం ఎన్నో రకాల ప్రయత్నాలు చేసినప్పటికిని ఉదయకాలం సమయం కావడంతో యువత బయట ప్రదేశాలకు చేరిపోయి భయంకరమైన ఆగడాలతో కూడిన సంబరాలను జరుపుకోవడం వల్ల కొన్నిచోట్ల అపసృతులు జరిగాయని గుర్తుకు చేశారు.ఇదే పద్ధతి ఇలాగే కొనసాగితే హోలీ పండుగ పేరు పరమార్ధంగా మారిపోయే ఆస్కారాలు ఉన్నాయన్నారు.పండుగ ఉత్సవాలను అందరికీ సంతోష యోగంగా జరుపుకోవాలని సమాజానికి తలవంపులు తీసుకొచ్చే విధంగా జరుపుకోకూడదని సూచించారు.యువతను కట్టడి చేయడంలో అన్ని వర్గాలు విఫలమవుతున్నాయని యువత సన్మార్గంలో ఉంటేనే సమాజం శాంతియుతంగా ఉండగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోరం..

**ఇద్దరు పిల్లల్ని చంపి తల్లి ఆత్మహత్య**
**కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను చంపిన తల్లి**
**అనంతరం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య**
**భర్తతో విభేదాలే కారణమని ప్రాథమిక అంచనా**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**




యాదాద్రి భువనగిరి, జై భీమ్ న్యూస్

కుటుంబ కలహాలు ఓ కుటుంబాన్ని బలితీసుకున్నాయి. భర్తతో ఉన్న విభేదాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు బిడ్డలను చంపి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతులు. కొంతకాలంగా వీరి మధ్య తీవ్రస్థాయిలో మనస్పర్థలు, గొడవలు జరుగుతున్నాయి. దీంతో విసిగిపోయిన ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం రోజే ఆమె కుటుంబసభ్యులు నచ్చజెప్పి తిరిగి అత్తగారి ఇంట్లో వదిలివెళ్లారు. అయితే, పుట్టింటి నుంచి వచ్చిన కొన్ని గంటల్లోనే ఈ దారుణం జరిగింది. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులను దిండుతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు విడిచింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య గొడవలే ఈ దారుణానికి కారణమని కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘోరంతో గొల్లగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## తెలంగాణ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**భారతీయ సంప్రదాయంలో రంగుల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్న కేసీఆర్**
**ఈ పండుగ జీవితంలో నూతనత్వానికి సంకేతమని ట్వీట్**
**ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హోలీ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంప్రదాయంలో రంగుల పండుగకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఇది మనుషుల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించే అద్భుతమైన వేదిక అని ఆయన కొనియాడారు. ఆకులు రాలే శిశిరం ముగిసి, ప్రకృతి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ వచ్చే ఈ పండుగ, సామాజిక జీవితంలో నూతనత్వానికి సంకేతమని కేసీఆర్ అభివర్ణించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత నిరాశలో ఉన్న తెలంగాణ ప్రజల్లో ఈ హోలీ పండుగ సరికొత్త ఆశలను, విశ్వాసాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సహోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని, ఈ రంగుల వేడుక అందరి నడుమ ఆప్యాయతలను మరింతగా విరజిమ్మాలని కేసీఆర్ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రకృతిలో వచ్చే మార్పుల వలెనే ప్రజల జీవితాల్లో కూడా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు.

## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప ముఖ్యమంత్రి**
**ఈ నెల 5న తన కుమారుడి వివాహానికి రావాలంటూ ఆహ్వానం**
**శుభాకాంక్షలు తెలిపిన జగన్**



విజయవాడ, జై భీమ్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు విక్రమాదిత్య వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన కుమారుడి వివాహానికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తూ భట్టివిక్రమార్క ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# కుటుంబ క్షేమం కోసం గడప గడపకు కలశ యాత్ర





## వారాహి అమ్మవారి కృప కోసం గ్రామాల్లో ఆధ్యాత్మిక జాగృతి

**హన్మకొండ, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉప్పొంగుతోంది. కుటుంబ క్షేమం, శాంతి, సుభిక్షం కోసం నిర్వహిస్తున్న పవిత్ర కలశ పూజ కార్యక్రమం భక్తుల మనసులను కదిలిస్తోంది. శ్రీ అవధూత రాఘవేంద్ర గిరి మహారాజు ఆదేశానుసారం మంగళవారం రోజున ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారాహి అమ్మవారు అనుగ్రహం సమస్త ప్రజలకు కలగాలని సంకల్పంతో ప్రత్యేక మంత్రోచ్చారణల మధ్య కలశాన్ని వారి నిర్వహకులు ప్రతిష్టించారు. వేదఘోషల నడుమ ప్రతిష్టించిన ఈ పవిత్ర కలశం ఇప్పుడు గ్రామాలలో గడప గడపకు పర్యటిస్తూ ప్రతి ఇంటికీ దైవ దీవెనలు చేకూరుస్తోంది. పూజించిన కలశాన్ని ఒక్కో గ్రామానికి పంపిస్తూ, అక్కడి వారాహి అమ్మవారి భక్తుల ఇళ్లలో ఒక గంట సమయం ఉంచాలని నిర్వాహకులు సూచించారు. భక్తులు తమ ఇళ్లలో కలశాన్ని ఉంచి హారతి ఇవ్వడం, పసుపు కలిపిన పవిత్ర జలాన్ని ఇంటి ప్రాంగణంలో చల్లడం, కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రార్థనలు చేయడం ద్వారా ఇంటిలో ఉన్న నర దృష్టి, అశుభ ప్రభావాలు, చెడు గాలులు తొలగి శుభఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో మహిళలు, వృద్ధులు, యువత భక్తి భావంతో కలశాన్ని స్వాగతిస్తూ పూలతో అలంకరించి హారతులు ఇస్తుండటం విశేషం. కలశం ఒక ఇంటి నుండి మరో ఇంటికి భక్తుల సమక్షంలో గౌరవప్రదంగా తీసుకువెళు తున్నారు. ఈ విధంగా గ్రామమంతా పర్యటించిన అనంతరం మార్చి 8వ తేదీన యజ్ఞశాలకు తిరిగి తీసుకురానున్నారు. ఈ కలశ యాత్ర ద్వారా ప్రతి ఇంటికి వారాహి అమ్మవారి దీవెనలు చేరాలని, కుటుంబాల్లో ఐక్యత పెరగాలని, సుఖశాంతులు నెలకొనాలని దత్త గురువులు ఆశీర్వదించారు. ఇక కలశ యాత్రతో పాటు కుటుంబ క్షేమం కోసం నిర్వహిస్తున్న మహా హోమానికి సంబంధించిన రక్షాసూత్రాలు (రక్షలు) కూడా భక్తులకు అందజేయబడుతున్నాయి. వాటిని ధరించడం ద్వారా దైవ రక్షణ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పవిత్ర అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి కుటుంబం తమ ఇళ్లలో కలశాన్ని ఆహ్వానించి భక్తి శ్రద్ధలతో హారతి ఇచ్చి వారాహి అమ్మవారి కృపను పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గ్రామాలన్నీ ఆధ్యాత్మిక చైతన్యంతో మార్మోగేలా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

# జిఎంఆర్ బృందావన్ అపార్ట్మెంట్స్‌లో ఘనంగా హోలీ సంబరాలు



**హన్మకొండ, 03 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ వడ్డేపల్లిలోని జిఎంఆర్ బృందావన్ అపార్ట్మెంట్స్‌లో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. అపార్ట్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. అపార్ట్మెంట్‌లోని మొత్తం 278 ఫ్లాట్లకు చెందిన నివాసితులు లాన్‌లో కూడి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంగురంగుల వేదిక కింద హర్షోల్లాసాలతో హోలీ ఆడారు. నీటి షవర్ల కింద తడుస్తూ, రంగులతో ఒకరినొకరు అభిషేకించుకుంటూ చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సందడిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వర్ణకుమార్, కోశాధికారి నవీన్ కుమార్, ఉపాధ్యక్షురాలు నాగ కుమారి, సహాయ కార్యదర్శులు మమత, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వందలాది మంది నివాసితులు పాల్గొని అపార్ట్మెంట్ ప్రాంగణాన్ని రంగుల మయం చేశారు. సామరస్యానికి, ఆనందానికి ప్రతీకగా నిలిచిన ఈ హోలీ సంబరాలు నివాసితుల మధ్య ఐక్యతను మరింత బలపరిచాయి.

# హనుమకొండకు గర్వకారణం

### ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి వైద్యురాలిగా డా. ప్రణీత జిల్లపల్లి

**హన్మకొండ, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



సమ్మయ్య నగర్‌కు చెందిన జిల్లపల్లి సుధాకర్ -- రమాదేవి దంపతుల చిన్న కుమార్తె డా. ప్రణీత జిల్లపల్లి ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి వైద్యురాలిగా పట్టా సాధించడం హనుమకొండకు గర్వకారణంగా నిలిచింది. చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన ప్రణీత, వైద్య రంగంపై ప్రత్యేక ఆసక్తి పెంచుకుని కష్టపడి చదివి తన లక్ష్యాన్ని సాధించారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష అయిన నీట్ లో 500 మార్కులు సాధించి ప్రతిభ చాటిన ఆమె, ఫ్రీ సీటుతో ఆంధ్రప్రదేశ్‌లోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్ సీటు పొందారు. వైద్య విద్యలో క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో చదువుతూ అన్ని సంవత్సరాల్లో మంచి ఫలితాలు సాధించి, చివరకు ఎంబిబిఎస్ ను ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించారు. వైద్య విద్యను కేవలం వృత్తిగా కాకుండా సేవా దృక్పథంతో స్వీకరించిన ప్రణీత, "సమాజానికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం నా లక్ష్యం" అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆమె ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ అఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డా. సాయి సుధీర్ చేతులమీదుగా ప్రణీత డాక్టర్ పట్టా అందుకున్నారు. ఈ ఘన కార్యక్రమం ఆమె జీవితంలో మరపురాని క్షణంగా నిలిచింది. తన విజయానికి తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల సహకారం ముఖ్య కారణమని ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు స్థానికులు డా. ప్రణీత జిల్లపల్లికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్తులో వైద్య రంగంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన యువతులు విద్యా రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలు సాధించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. డా. ప్రణీత విజయంతో సమ్మయ్య నగర్ ప్రాంతం ఆనందోత్సాహాలతో మురిసిపోతోంది.

# ములుగు సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌లో అన్ని సదుపాయాలు సక్రమం

## అసత్య ప్రచారాలను నమ్మవద్దని టీజీఎంఎస్‌ఐడీసీ వివరణ


**ములుగు, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లాలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్ (సిఎంఎస్)లో నిల్వ సదుపాయాలపై వస్తున్న ప్రచారాల నేపథ్యంలో టీజీఎంఎస్‌ఐడీసీ అధికారులు స్పష్టత ఇచ్చారు. సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌లో మందుల నిల్వకు అవసరమైన అన్ని సదుపాయాలు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎస్.కే. ప్రసాద్ ప్రకటన విడుదల చేస్తూ, ఇటీవల కొందరు వ్యక్తులు సిఎంఎస్ భవనం మరియు నిల్వ విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. మందుల భద్రపరచడంలో ఉష్ణోగ్రత నియంత్రణకు ప్రత్యేక డీప్ ఫ్రీజర్లు, ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా టీకాలు మరియు ఉష్ణోగ్రతకు సున్నితమైన మందుల కోసం ప్రత్యేక కోల్డ్ స్టోరేజ్ గదులు ఉన్నాయని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. డీప్ ఫ్రీజర్లలో ఐస్ ప్యాక్స్ సక్రమంగా భద్రపరిచి, మందుల నాణ్యతను కాపాడుతున్నామని పేర్కొన్నారు. ములుగు జిల్లా పరిధిలోని ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మందులు సకాలంలో సరఫరా అవుతున్నాయని, గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాలకు కూడా నిరంతర పంపిణీ జరుగుతోందని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా సెంట్రల్ మెడిసిన్ స్టోర్ కీలక బాధ్యత నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా, అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని టీజీఎంఎస్‌ఐడీసీ అధికారులు ప్రజలను కోరారు.

# జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుష ఘటన

### మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు
### ఆసుపత్రి నిర్వహణపై తీవ్ర విమర్శలు

**జడ్చర్ల, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



ప్రభుత్వ ఆసుపత్రుల్లో మృతదేహాలను గౌరవప్రదంగా భద్రపరచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, గవర్నమెంట్ హాస్పిటల్ జడ్చెర్లలో చోటుచేసుకున్న దారుణ ఘటన ప్రజలను కలవరపరిచింది. మార్చురీలో భద్రపరచాల్సిన మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన బయటపడటంతో ఆసుపత్రి నిర్వహణపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం, జడ్చర్ల మండలం నాగసాల గ్రామానికి చెందిన భీమేష్ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందారు. మృతదేహం లభ్యమవడంతో పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్చురీలో భద్రపరచాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మృతదేహాన్ని కనీసం స్ట్రెచర్‌పై కూడా ఉంచకుండా నేలపైనే వదిలివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో సంచరించే కుక్కలు మార్చురీలోకి ప్రవేశించి మృతదేహాన్ని పీక్కుతిన్నాయని తెలిసి స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలకు అవసరమైన రక్షణ కల్పించాల్సిన చోటే ఈ ఘటన జరగడం మానవత్వానికే మచ్చగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బతికున్నప్పుడు ఎలా ఉన్నా, చనిపోయిన వ్యక్తికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించడం మన సంస్కృతి. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలోనే మృతదేహం కుక్కలకు ఆహారంగా మారడం దయనీయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చురీలో ఫ్రీజర్లు లేకపోవడం లేదా ఉన్నవి పనిచేయకపోవడం, భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాల వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, మార్చురీల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ వైద్యసంస్థలపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి.

# అసభ్యకర కామెంట్లు.. సైబర్ క్రైమ్ పోలీసులకు రేణుదేశాయ్ ఫిర్యాదు

### సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన రేణుదేశాయ్
### కొంతమంది నెటిజన్లు పరిధి దాటి ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు
### ప్రధానంగా నాలుగు అకౌంట్లపై ఆధారాలతో ఫిర్యాదు చేసిన రేణుదేశాయ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రముఖ నటి రేణుదేశాయ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. సోషల్ మీడియాలో కొంతమంది అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా కొంతమంది నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో పరిధి దాటి ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా తనపై కామెంట్లు పెడుతున్న నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఆధారాలతో సహా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేణుదేశాయ్ మహిళలు, చిన్నారులు, మూగజీవాల రక్షణపై తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల్లో నిత్యం పంచుకుంటున్నారు. ముఖ్యంగా ఇటీవల శునకాల గురించి ఆమె కొన్నిరోజుల క్రితం పెట్టిన ప్రెస్‌మీట్‌పై పలువురు నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వీధి కుక్కల దాడులపై తాను చేసిన కొన్ని వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు నెటిజన్లు హద్దుమీరారని ఆమె ఆరోపించారు. ఈ క్రమంలో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

# కాకతీయ యూత్ క్లబ్ ఆటస్థలంపై కబ్జా ఆరోపణలు

### ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్‌ను కలిసిన యూత్ సభ్యులు



**హైద్రాబాద్, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

కాట్రపల్లి గ్రామానికి చెందిన కాకతీయ యూత్ అసోసియేషన్ సభ్యులు తమ క్లబ్ ఆటస్థలం కబ్జాకు గురైందని ఆరోపిస్తూ మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లగొప్పుల హరీష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, 1976లో స్థాపించబడిన కాకతీయ యూత్ క్లబ్ (రిజిస్ట్రేషన్ నెం.1070/1989) కు సర్వే నంబర్ 323లో 39 గుంటల స్థలం దానం చేయబడిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం పట్టా, పహానిలో క్లబ్ పేరుతో నమోదు అయి, గ్రామపంచాయతీకి పన్నులు చెల్లిస్తూ ఆటస్థలంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఫిబ్రవరి 24న కొంతమంది వ్యక్తులు స్థలాన్ని కబ్జా చేసి పిల్లర్ బొందలు తీయడం ప్రారంభించారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పేరుతో స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని, తమ సభ్యులను అడ్డుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు పేర్కొన్నారు. తమ ఆటస్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ సానుకూలంగా స్పందించి, స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్‌తో పాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**





జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్. హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో రంగుల వేడుకలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, హోం గార్డులు మరియు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు స్నేహభావం, ఐక్యత, సోదరభావాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బంది, హోం గార్డులు మరియు వారి కుటుంబ సభ్యులకు హోలీ శు భాకాంక్షలు తెలియజేశారు. "మంచి చెడుపై గెలుపును సూచించే రంగుల పండుగ అయిన హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగును, ఆనందాన్ని నింపాలి" అని ఆమె అన్నారు. అలాగే, జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబ సభ్యులని, నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువంటి వేడుకలు మానసిక ఉల్లాసాన్ని కలిగించి పరస్పర ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీ వీరేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఉమెన్ ఇన్స్పెక్టర్, ఇన్స్పెక్టర్ లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్. ఐ లు, ఆర్ ఎస్ ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎర్రగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ప్రారంభం

**గ్రహణం నేపథ్యంలో సమయ మార్పులు, భారీగా తరలివచ్చిన భక్తులు**

**హన్మకొండ జిల్లా, హాసన్‌పర్తి, మార్చి 3, 2026 (జై భీమ్ న్యూస్):**

హాసన్‌పర్తి మండలంలోని ప్రసిద్ధ ఎర్రగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ జాతర ఈసారి చంద్రగ్రహణం కారణంగా మార్పులతో నిర్వహించబడింది. గ్రహణం దృష్ట్యా ఉత్సవాల నిర్వహణలో సమయాల్లో మార్పులు చేపట్టినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా తెల్లవారుజామున ప్రారంభమయ్యే కార్యక్రమాలను మధ్యాహ్ననికి మార్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనం కోసం క్యూలలో నిలిచారు. వేదఘోషల నడుమ ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభమై, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. పుష్పాలు, పాలు, పండ్లతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. చంద్రగ్రహణం ప్రారంభానికి ముందు భక్తులందరికీ దర్శనం కల్పించేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం గ్రహణ సమయానికి ఆలయ ద్వారాలు మూసివేసి, గ్రహణం ముగిసిన తర్వాత సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి తిరిగి దర్శనాన్ని పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. జాతరలో భాగంగా నిర్వహించిన రథోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సమీప గ్రామాలైన హన్మకొండ, భీమారం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథాన్ని లాగుతూ భక్తి ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. గ్రామీణ వాతావరణంలో జాతర శోభ మరింత ఉత్సాహాన్ని కలిగించింది. ఉత్సవాల నిర్వహణలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్యశిబిరం, పార్కింగ్, శానిటేషన్ సదుపాయాలు కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మరిన్ని రోజుల్లో ప్రత్యేక పూజలు, వాహన సేవలు, అన్నదాన కార్యక్రమాలు



నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. చివరి రోజు మహాపూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. గ్రహణం మధ్య కూడా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగడం విశేషంగా నిలిచింది.

# ప్రజా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

**కొత్త కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం**



**హైద్రాబాద్, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లాల కలెక్టర్లు మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వారితో విస్తృతంగా చర్చించి పాలనలో ప్రాధాన్య అంశాలపై మార్గదర్శనం చేశారు. గడిచిన రెండు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఆ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా చూడటం జిల్లా కలెక్టర్ల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని క్షేత్ర స్థాయిలో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారుల సేవా జీవితంలో జిల్లా కలెక్టర్ పదవి అత్యంత కీలకమని, ప్రజలతో మమేకం అయ్యే అపూర్వ అవకాశమని చెప్పారు. జిల్లాల్లో పని చేసిన అనుభవం భవిష్యత్తు పరిపాలనలో ఎంతో ఉపయుక్తమవుతుందని వివరించారు. ప్రజాపాలన ప్రజాకేంద్రంగా సాగాలని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను సమర్థంగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా అధికార యంత్రాంగం ఒక జట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

# ఇంచెర్వుపల్లి గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా



**మంగపేట, 03 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

ఇంచెంచెర్వుపల్లి గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. వెంకటాపూర్ మండలం పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా భారత రాష్ట్ర సమితి జిల్లా నాయకులు, ములుగు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్రీ పోరిక గోవింద్ నాయక్ పాల్గొన్నారు. ఆయన అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించి, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. గ్రామ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఎడ్ల మురళి, ములుగు జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు కామ అశోక్, తెలంగాణ ఉద్యమ నాయకులు కామ కృష్ణమూర్తి, సర్పంచ్ అభ్యర్థి లావుడ్యా దేవేందర్, సీనియర్ నాయకులు జాటోత్ రాజ్‌కుమార్, నర్రావుల అశోక్, ఆగే తిరుపతి, సంతోష్, గుడి పూజారి లావుడ్యా సారయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ మహిళా భక్తులు హారతులు పట్టి అమ్మవారికి మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ ప్రతిష్టాపన కార్యక్రమంతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో కళకళలాడింది. గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని భక్తి భావాన్ని చాటుకున్నారు.

# ఇరాన్‌పై దాడులను మోదీ ఖండించకపోవడం దారుణం: బీవీ రాఘవులు

**ట్రంప్ హయాంలో అమెరికా అనుసరిస్తున్న వైఖరి అనైతికమని వ్యాఖ్య**

**మోదీ ప్రభుత్వం విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గుతోందని విమర్శ**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. చర్చల పేరుతో అకస్మాత్తుగా దాడులు చేయడం అనైతికమని, ట్రంప్ హయాంలో అమెరికా అనుసరిస్తున్న మొండి వైఖరిని ఆయన తప్పుబట్టారు. నెతన్యాహుతో భేటీల నేపథ్యంలో భారత్ ఈ దాడులకు పరోక్ష మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోందని రాఘవులు ఆరోపించారు. గల్ఫ్ దేశాల్లోని కోట్లాది మంది భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారి భద్రతపై కేంద్రం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికా సుంకాల విషయంలో మోదీ ప్రభుత్వం విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గుతోందని విమర్శించారు. వీటికి నిరసనగా మార్చి 24న ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు రాఘవులు ప్రకటించారు.

# ఇసుక క్వారీల డీఎల్‌సీలు జిల్లా కలెక్టర్ నిర్వహించాలి

**పెసా చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి**

**మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య డిమాండ్**



**మంగపేట, మార్చి 03 (జై బీమ్ న్యూస్)**

ములుగు జిల్లా మంగపేట మండలంలో మంగళవారం మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ ఆధ్వర్యంలో గిరిజన భవనంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు తాటి నాగరాజు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గొప్ప వీరయ్య మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని గోదావరి నది ఇసుక ఖనిజాన్ని ఆదివాసీలే నిర్వహించి వ్యాపార లావాదేవీలు చేయాల్సిన హక్కు ఉందని గుర్తుచేశారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ములుగు జిల్లాలో ఇసుక క్వారీలకు సంబంధించి డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ (డీఎల్‌సీ) సమావేశాలు జిల్లా కలెక్టర్ ద్వారా నిర్వహించకపోవడం వల్ల ఆదివాసీలకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వారం వారం డీఎల్‌సీలు నిర్వహించేవారని, ప్రస్తుతం సర్వేలు పూర్తయి రెండేళ్లు దాటినా ఒక్క డీఎల్‌సీ కూడా జరగలేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క (దనసరి అనసూయ) సూచించినప్పటికీ జిల్లా కలెక్టర్ డీఎల్‌సీలు పెట్టడం లేదని, అలాగే పెసా గ్రామ సభలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ములుగు జిల్లాలో ఇసుక క్వారీలు పూర్తిగా నిలిపివేయడంతో ఆదివాసీల జీవనాధారం దెబ్బతింటోందని తెలిపారు. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మాత్రం డీఎల్‌సీలు, పెసా గ్రామ సభలు సక్రమంగా నిర్వహించడంతో అక్కడి ఆదివాసీలకు ఆర్థిక లాభాలు కలుగుతున్నాయని పోల్చిచూపారు. ఇప్పటికే సర్వేలు చేయించుకుని ఖర్చులు భరించిన ఆదివాసీ సంఘాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, సర్వే పూర్తైన 33 ఇసుక క్వారీలకు తక్షణమే డీఎల్‌సీలు నిర్వహించాలి అని డిమాండ్ చేశారు. అలాగే భవిస్ మిశ్రా (వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎండీసీ) జారీ చేసిన 09-02-2026 ఆదేశాలను జిల్లా కలెక్టర్ తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు పట్టాల పేరుతో ఇసుక క్వారీలకు అనుమతులు ఇస్తే ఆదివాసీ సంఘాలుగా తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈసం యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తోలేం నరసింహారావు, ఆక తిరుమల రావు, ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్, జిల్లా నాయకులు గొప్ప చంద్రకాంత్, చాద హరిబాబు, పునెం రాములు, మండల నాయకులు జబ్బ నరేష్, చీమల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు: మహేశ్ కుమార్ గౌడ్

**కార్పొరేట్లకే బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందన్న మహేశ్ గౌడ్**

**తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని విమర్శ**

**లొంగిపోయిన మావోలు కాంగ్రెస్ లోకి వస్తే ఆహ్వానిస్తామని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపు స్పష్టత వస్తుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కేవలం కార్పొరేట్ శక్తులకే పెద్దల సభలో అవకాశం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే, మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ... దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వారి పట్ల తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధపడి, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ, లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

# రంగుల హోలీ పండుగలో ఆనంద జీవితం సంబరాలు



**మంగపేట, మార్చి 03 (జై బీమ్ న్యూస్)**

మంగపేట మండల కేంద్రంలో మంగళవారం రంగుల హోలీ పండుగను ప్రజలు ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలు, యువత, పెద్దలు అన్న తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హోలీ అంటేనే యువతకు, పిల్లలకు ఎక్కడలేని ఉత్సాహం. పండుగరోజు చల్లుకునే రంగులు కేవలం గులాలే కాకుండా అనురాగం, ఆప్యాయత, స్నేహభావాల ప్రతీకగా మారాయి. పన్నీటి రంగుల జల్లుల మధ్య నవ్వులు, కేరింతలు, సందడి వాతావరణం నెలకొంది. గ్రామ వీధులన్నీ రంగులతో కళకళలాడగా, యువత డీజే పాటలకు నృత్యాలు చేస్తూ పండుగను మరింత ఉత్సాహంగా మార్చారు. పెద్దలు చిన్నారులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోలీ పండుగ మనందరి జీవితాలలో సంతోషాలు, సఖ్యత, సౌభ్రాతృత్వం నింపాలని ప్రజలు ఆకాంక్షించారు. రంగుల హోలీ ఆనంద కేళిగా మంగపేటలో చిరస్మరణీయంగా నిలిచింది.

# హైదరాబాద్‌లో కల్తీ ఉత్పత్తుల ముఠా బట్టబయలు

**భారీగా నకిలీ టీ, సర్ఫ్, రీఫిల్స్ స్వాధీనం**




**హైద్రాబాద్, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లో నకిలీ ఉత్పత్తుల వ్యాపారం మరోసారి వెలుగులోకి వచ్చింది. లాభాల కోసం కల్తీ రాయుళ్లు నాణ్యత లేని మెటీరియల్‌ను గుజరాత్ నుంచి నగరానికి తీసుకొచ్చి, ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ కవర్లు అతికించి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా నిర్వహించిన దాడుల్లో భారీగా నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 1,340 రెడ్డి లేబల్ టీ ప్యాకెట్లు, 100 తాజ్ మహల్ టీ ప్యాకెట్లు, 1,900కు పైగా సర్ఫ్ ఎక్సెల్ సర్ఫ్ పౌడర్ ప్యాకెట్లు, 3,600 నకిలీ గుడ్ నైట్ రీఫిల్స్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉత్పత్తులు పూర్తిగా నకిలీవని, నాణ్యత ప్రమాణాలు లేకుండా తయారు చేసి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ముఠాపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే ముందు ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని, తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, ఎంఆర్పి వంటి వివరాలను పరిశీలించాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పదంగా తక్కువ ధరకు అమ్ముతున్న వస్తువులను కొనరాదని హెచ్చరించారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఉత్సాహంగా హోలీ సంబరాలు

ఐక్యతకు ప్రతీకగా రంగుల వేడుకలు

**వరంగల్, 03 మార్చి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**





వరంగల్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో హోలీ పండుగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం రంగుల సందడిలో ఘనంగా సంబరాలు నిర్వహించబడ్డాయి. పోలీస్ బ్యాండ్ వాయిద్యాల నడుమ అధికారులు, సిబ్బంది కమిషనర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని వేడుకలను ఉత్సాహంగా ప్రారంభించారు. కార్యాలయ ప్రాంగణం రంగుల హరివిలాసంతో కళకళలాడింది. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ని అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు రంగులతో ముంచెత్తుతూ హర్షాతిరేకంతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ దంపతులతో కలిసి అధికారులు, సిబ్బంది పరస్పరం ఒకరికి ఒకరు రంగులు జల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ హోలీ వేడుకలను జరుపుకున్నారు. సాంప్రదాయ సంగీతం, బ్యాండ్ వాయిద్యాల మధ్య తీన్మార్, నాగిన్ డాన్స్ స్టెప్పులతో నృత్యాలు చేస్తూ పోలీస్ సిబ్బంది ఉత్సాహాన్ని చాటుకున్నారు. అధికారులు, సిబ్బంది పరస్పరం హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఐక్యతను ప్రతిబింబించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హోలీ పండుగ సౌహార్దం, సోదరభావం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. భిన్న సంస్కృతులు, భిన్న భావాలు ఉన్నా సమాజం ఐక్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ శాంతి, సంతోషాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిత్యం నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది ఇలాంటి వేడుకల ద్వారా పరస్పర బంధాలను మరింత బలపరుచుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, అదనపు డీసీపీ సురేష్ కుమార్, శ్రీనివాస్ తదితర ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం రంగుల కాంతులతో కళకళలాడుతూ హోలీ సంబరాలు ఆనందభరిత వాతావరణంలో ముగిశాయి.

## అమెరికాకు చుక్కలు చూపిస్తున్న ఖర్చులు.. ఒక్కరోజే రూ. 7 వేల కోట్లు!



**వాషింగ్టన్/టెహ్రాన్:**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెను భారాన్ని మోపుతున్నాయి. ఇరాన్‌పై ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' అగ్రరాజ్యానికి భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. తాజా అంచనాల ప్రకారం, యుద్ధం మొదలైన తొలి 24 గంటల్లోనే అమెరికా సుమారు 779 మిలియన్ డాలర్లు (దాదాపు ?7,000 కోట్లు) ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

**నిర్వహణ భారంతో అల్లాడుతున్న ఖజానా**

కేవలం దాడులకే కాకుండా, యుద్ధ నౌకల నిర్వహణకు అమెరికా భారీగా చెల్లించాల్సి వస్తోంది. యూఎస్‌ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి ఒక్కో యుద్ధ విమాన వాహక నౌక నిర్వహణకే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు (సుమారు ?59 కోట్లు) ఖర్చవుతోంది. యుద్ధానికి ముందే బలగాల మోహరింపు కోసం మరో ?5,700 కోట్లకు పైగా వెచ్చించినట్లు రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**ఆయుధాల నష్టం.. ఆందోళనలో రక్షణ శాఖ**

ఆర్థిక భారంతో పాటు సాంకేతిక నష్టం కూడా అమెరికాను కలవరపెడుతోంది. కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోవడం పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఉక్రెయిన్, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో ఇప్పటికే క్షిపణి నిరోధక వ్యవస్థలను మోహరించిన నేపథ్యంలో, ఇరాన్ యుద్ధంలో ఆయుధాలను కోల్పోవడం అమెరికా రక్షణ సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

**మొత్తం లెక్క ?3 లక్షల కోట్లు దాటింది!**

2023 అక్టోబరులో హమాస్ దాడి తర్వాత నుంచి ఇప్పటివరకు పశ్చిమాసియాలో అమెరికా చేసిన మొత్తం ఖర్చు సుమారు 33.77 బిలియన్ డాలర్లకు (దాదాపు ?3.1 లక్షల కోట్లు) చేరినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధం మరో 4-5 వారాలు కొనసాగవచ్చని ప్రకటించిన నేపథ్యంలో, ఈ ఆర్థిక భారం అమాంతం పెరిగే అవకాశం ఉంది. మరోవైపు, ఇరాన్ హర్ముజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడం ప్రపంచ వాణిజ్యంపై, ముఖ్యంగా చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపేలా కనిపిస్తోంది.

## ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన 17 మందికి జరిమానాలు విధింపు

కే సుజాత వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్



**వరంగల్, 03 మార్చి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఒక వాహనదారును పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నిధి రాజ్ సంబంధిత వ్యక్తికి రూ.1,000 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ 16 మంది వాహనదారులపై కోర్టు రూ.24,500ల మొత్తం జరిమానా విధించింది. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. సుజాత మాట్లాడుతూ, నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని పోలీసులు కోరారు.

## మహాశాంతి హోమానికి పలువురు ఎమ్మెల్యేలకు ప్రత్యేక ఆహ్వానం



**హన్మకొండ, 03 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ సమాజ శాంతి, దేశాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, సౌభాగ్యాల కోసం నిర్వహించనున్న మహాశాంతి హోమ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించే కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ ఆహ్వాన కార్యక్రమంలో నిర్వాహకులు పలువురు ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి మహత్తర యజ్ఞంలో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి మహాశాంతి హోమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆశీర్వచనాలు అందించాలని ఆహ్వాన పత్రం అందజేశారు. హోమం నిర్వహణ ఉద్దేశాలు, కార్యక్రమ విస్తృతి, వేదపండితుల ఆధ్వర్యంలో జరగనున్న ప్రత్యేక పూజల గురించి వివరించారు. జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేసే ఈ కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరిను కలిసి దేశశాంతి హోమానికి ప్రత్యేక ఆహ్వానం పలికారు. దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజల్లో సత్సంకల్పాలు పెంపొందాలని ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ప్రముఖ ప్రజానేత కేఆర్ నాగరాజును కలిసి హోమంలో పాల్గొనాలని కోరారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిను కూడా కలిసి మహాశాంతి హోమానికి ఆహ్వానించారు. ప్రజల క్షేమం కోసం నిర్వహించే ఈ యజ్ఞంలో తప్పకుండా పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, "మహాశాంతి హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల శక్తిని పెంపొందిస్తాయి. ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం నిర్వహించే యజ్ఞాలు మన సంప్రదాయాలకు ప్రతీకలు. ఈ కార్యక్రమం జిల్లాకు ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకు రావాలని కోరుకుంటున్నాను" అన్నారు. ప్రజానేత కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, "దేశ శాంతి, ప్రజల ఐక్యత కోసం నిర్వహించే హోమాలు ఎంతో అవసరం. యువత ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని భారతీయ సంస్కృతిని పరిరక్షించాలి" అని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, "మహత్తర యజ్ఞాలు సమాజానికి ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తాయి. ప్రజల క్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నాను" అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల శాంతి, సామరస్యాలు, సుభిక్షం కోసం నిర్వహించే మహాశాంతి హోమం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ యజ్ఞాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వాహకులు వెల్లడించిన వివరాల ప్రకారం, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, మహామృత్యుంజయ హోమం తదితర ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై యజ్ఞంలో పాల్గొని దైవ ఆశీర్వాదాలు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక గురువులు, సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు. మహాశాంతి హోమం జిల్లాలో ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది పలకడంతో పాటు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వ వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ సెక్రటేరియట్‌లో కలెక్టర్ల సదస్సు

99 రోజుల "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"పై సీఎం దిశానిర్దేశం




**హైద్రాబాద్, 03 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయనున్న 99 రోజుల "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక"పై మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాల కలెక్టర్లతో విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , దామోదర్ రాజా నరసింహ , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , దుద్దిల్లా శ్రీధర్ బాబు , వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణ రావు, కొండా సురేఖ , సీతక్క తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ సభల్లో పథకాల వారీగా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధులను ప్రజలకు వివరించాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అదేవిధంగా విద్యా వ్యవస్థలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను సమీప మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేసి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు సమయానికి చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలవ్వాలని, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## వేములవాడలో పిచ్చి కుక్క బీభత్సం.. 25 మందికి పైగా గాయాలు



**(వేములవాడ జై భీమ్ న్యూస్)**

వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి, సుమారు 25 మందికి పైగా ప్రజలను గాయపరిచింది. గాయపడిన వారిలో రాజన్న భక్తులు కూడా ఉన్నారు. బాధితులు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ ఇప్పపూల మమత- అజయ్ లు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుక్కల బెడదను అరికట్టేందుకు 15 రోజుల క్రితమే 40 కుక్కలను ఏ.బి.సి కేంద్రానికి తరలించామని, అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఆందోళన చెందవద్దని చైర్మన్ రాజు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

# హైడ్రాకు ఈ అక్రమ వెంచర్లు కనిపించడం లేదా..

**వీటికి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారు: కవిత**
**నార్సింగిలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయంటూ కవిత ఆందోళన**
**ఈ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్**
**బీఆర్ఎస్ హయాంలో ఇక్కడి భవనాలకు అనుమతులు ఇచ్చారని విమర్శలు**
**కాంగ్రెస్ లంచాలు తీసుకుని వాటికి మళ్లీ అనుమతులు ఇచ్చిందన్న కవిత**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మిస్తున్నారని, వాటిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. అక్కడి వెంచర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇళ్లు కూల్చివేస్తున్న హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని నిలదీశారు. కుత్బుల్లాపూర్, ఖమ్మం వెలుగుమట్ల, మూసీ నది పరిసరాల్లో అన్నీ పేదల ఇళ్లనే కూల్చుతున్నారని ఆరోపించారు. జనం బాటలో భాగంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలను హైడ్రా దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. పేదల ఇళ్లు కూల్చవద్దని కూడా విజ్ఞప్తి చేశామని అన్నారు. మూసీ నది పక్కన ఉన్న పేదల ఇళ్లను కూల్చిన హైడ్రా అధినేత రంగనాథ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూసీ నదిలోనే నిర్మిస్తున్న అక్రమ వెంచర్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అవసరమైతే రంగనాథ్ బుల్డోజర్ తీసుకువచ్చేవరకు ఇక్కడే నిరసన చేపడతామని హెచ్చరించారు. ఖమ్మం కూడా వెళ్లి పేదల తరపున కొట్లాడుతామని అన్నారు. 20 ఏళ్ల క్రితం కట్టిన మధ్యతరగతి వారు కొనుగోలు చేసిన అపార్టుమెంట్‌ను కూలగొట్టాలని చెబుతున్నారని, కానీ ధనికుల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు లేవని మండిపడ్డారు. ఈ అక్రమ భవనాలకు బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. ఆ తర్వాత లంచాలు తీసుకుని నిర్మాణాలకు తిరిగి పర్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. న్యాయం అందరికీ ఒకేలా ఉండాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటామని కవిత అన్నారు.



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

**నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద ఆందోళన చేపట్టిన కవిత**
**హైడ్రా వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరిక**
**కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

## తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం..

**నేడు రికార్డుస్థాయిలో విద్యుత్ వినియోగం**
**ఈరోజు 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ వెల్లడి**
**భవిష్యత్తు విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించిన భట్టివిక్రమార్క**
**డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడి**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మంగళవారం అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వేసవి కాలం సమీపించిన నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠస్థాయికి చేరుకుంది. విద్యుత్ అధికారులతో మల్లు భట్టివిక్రమార్క భేటీ అయ్యారు. సమర్థంగా విద్యుత్ పంపిణీ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్ విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాగా వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. దీంతో గృహ, కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. వ్యవసాయ రంగానికి కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. దీనితో రాష్ట్రంలో రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగడం కూడా అధిక విద్యుత్ వినియోగానికి మరో కారణంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో పరిశ్రమల అవసరాలకు కూడా విద్యుత్ వినియోగం అధికమవుతోంది.

## శ్రీకాకుళం ఏబీసీడబ్ల్యూవో ఇంట్లో కోట్లు..

**ఏసీబీ సోదాల్లో భారీగా అక్రమాస్తులు**
**ఏబీసీడబ్ల్యూవో బాల ముకుందరావు ఇళ్లపై ఏసీబీ దాడులు**
**సోదాల్లో రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తుల గుర్తింపు**
**మెస్ బిల్లుల మంజూరుకు లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు**
**బంగారం, వెండి, స్థిరాస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు**

శ్రీకాకుళం, జై భీమ్ న్యూస్

శ్రీకాకుళం జిల్లాలో ఓ అవినీతి అధికారి బాగోతం వెలుగులోకి వచ్చింది. నరసన్నపేట వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) గడ్డి బాల ముకుందరావు నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. నరసన్నపేటతో పాటు సోంపేట విభాగానికి కూడా బాల ముకుందరావు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. వసతిగృహాల మెస్ బిల్లులు మంజూరు చేయడానికి, ప్రతి విద్యార్థికి రూ.15 చొప్పున వార్డెన్ల నుంచి ఆయన లంచం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి 28న అధికారులు ఆయన కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, లెక్కల్లో చూపని రూ.1,84,070 నగదు పట్టుబడింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిన్న శ్రీకాకుళం పట్టణంలోని బాల ముకుందరావుకు చెందిన రెండు ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో రాజాం, శ్రీకాకుళం, కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని 4 స్థిరాస్తుల పత్రాలు, 322 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.75 కిలోల వెండి వస్తువులు, కొంత నగదు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ రూ.1.10 కోట్లుగా ఉంటుందని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

## రైతులకు శుభవార్త చెప్పిన ఏపీ కూటమి ప్రభుత్వం

**ఏపీలో పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఆమోదం**
**రూ.250 కోట్ల వ్యయంతో రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశాలు**
**నెలాఖరులోగా అనుమతులు జారీ చేయాలని డిస్కంలకు స్పష్టమైన గడువు**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్


ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది రైతులకు కూటమి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. సాగు సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ దరఖాస్తులన్నింటికీ అనుమతులు జారీ చేయాలని, రెండు నెలల్లోగా కనెక్షన్లను పూర్తిగా ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని విద్యుత్ పంపిణీ సంస్థలను (డిస్కంలను) ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ కోసం సుమారు రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి అవసరమైన 10,000 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించనుంది. ఈ విషయంపై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, రెండు నెలల్లోగా పెండింగ్ కనెక్షన్లన్నీ ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలని డిస్కంలను ఆదేశించామన్నారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటికే 22.30 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 1.12 లక్షల కనెక్షన్లను మంజూరు చేసింది. తాజా నిర్ణయంతో మరో 46 వేల మందికి పైగా రైతులకు వ్యవసాయ పనులకు విద్యుత్ సౌకర్యం అందనుంది.

## ప్రజలకు హోలీ శుభాకాంక్షలు చెప్పిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

**సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు**
**చెడుపై మంచి గెలుపునకు సూచిక ఈ పండుగ అన్న సీఎం చంద్రబాబు**
**సమత, మమతలకు హోలీ ప్రతీక అని పేర్కొన్న లోకేశ్**

విజయవాడ, జై భీమ్ న్యూస్

హోలీ పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగను పురస్కరించుకుని ఈరోజు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తమ సందేశాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. 'హోలీ పర్వదినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. చెడుపై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుంది. బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను' అని తన పోస్టులో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ తన సందేశంలో.. 'వసంత రుతువుకు స్వాగతం పలికే రంగుల సంబరం హోలీ. చెడుపై గెలిచిన మంచికి సంకేతం హోలీ. సమత, మమతలకు చిహ్నంగా, పేదా, పెద్ద తారతమ్యాలు లేకుండా, కులమత భేదాలు చూడకుండా రంగుల్లో అంతా కలిసిపోయి ఆనందాలను పంచుకునే హోలీ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు' అని తెలిపారు.



## విచారణకు హాజరుకావాల్సిందే..

**ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు హైకోర్టు కీలక ఆదేశం**
**రఘురామ కస్టడీ టార్చర్ కేసులో ఐపీఎస్ సునీల్ నాయక్‌కు తాత్కాలిక ఊరట**
**సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేయవద్దని పోలీసులకు హైకోర్టు మధ్యంతర ఆదేశం**
**ప్రతిరోజూ విచారణ అధికారి ముందు హాజరుకావాలని కఠిన షరతు**
**తదుపరి విచారణను మార్చి 9వ తేదీకి వాయిదా వేసిన న్యాయస్థానం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టడీ టార్చర్ కేసుకు సంబంధించి బీహార్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి మేఘావత్ సునీల్ కుమార్ నాయక్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం, సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించాలని కఠిన షరతులు విధించింది. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. తదుపరి విచారణ జరిగేంత వరకు సునీల్ నాయక్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. అదే సమయంలో, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య గుంటూరులోని విచారణ అధికారి ముందు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. కేసు తదుపరి విచారణను మార్చి 9వ తేదీకి వాయిదా వేశారు. 2021లో తాను నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు సీఐడీ అధికారులు కస్టడీలో తనను చిత్రహింసలకు గురిచేశారని రఘురామకృష్ణరాజు గుంటూరు నాగరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఏపీ సీఐడీలో డీఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సునీల్ నాయక్‌ను ఈ కేసులో ఏడవ నిందితుడిగా చేర్చారు. ప్రస్తుతం ఆయన బీహార్ కేడర్‌లో ఐజీపీగా సేవలందిస్తున్నారు. విచారణ సందర్భంగా, నాయక్ తరపు సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ వాదనలు వినిపిస్తూ, ఇది రాజకీయ ప్రేరేపిత కేసని అన్నారు. ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో లేని నాయక్ పేరును ప్రభుత్వం మారిన తర్వాత చేర్చారని, రఘురామ అరెస్టులో గానీ, కస్టడీలో గానీ ఆయనకు ఎలాంటి ప్రమేయం లేదని కోర్టుకు తెలిపారు. అయితే, పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదిస్తూ, కేసు దర్యాప్తు కోసం నాయక్‌ను కస్టడీలోకి తీసుకోవడం అవసరమని వాదించారు. గతంలో ఏపీ పోలీసులు సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు పాట్నాకు వెళ్లగా, స్థానిక కోర్టు ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాయక్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ లభించింది.


## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై ప్రచారం

**గాగ్ ఆర్డర్ ఇచ్చిన హైదరాబాద్ కోర్టు**
**టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి హైదరాబాద్ కోర్టులో ఊరట**
**ఆయనపై ఆధారరహిత కథనాలు ప్రసారం చేయొద్దని మీడియాకు ఆదేశం**
**ఇప్పటికే ప్రచురితమైన కంటెంట్‌ను తొలగించాలని స్పష్టం**
**గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకూ కోర్టు కీలక ఆదేశాలు జారీ**
**ఇది తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని ఆరోపించిన బీఆర్ నాయుడు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు హైదరాబాద్ కోర్టులో భారీ ఊరట లభించింది. తనపై జరుగుతున్న విష్రప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ విషయాన్ని బీఆర్ నాయుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తనపై ఎలాంటి ఆధారరహిత, దుష్ప్రచార కథనాలను ప్రసారం చేయకూడదని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలను కోర్టు స్పష్టంగా ఆదేశించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రచురితమైన లేదా ప్రసారమైన కథనాలను తక్షణమే తొలగించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నట్లు వివరించారు. ఇదే సమయంలో గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సైతం సంబంధిత కంటెంట్‌ను తమ సైట్ల నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించినట్లు నాయుడు పేర్కొన్నారు. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఏఐ, మార్ఫింగ్ వీడియోల ద్వారా తనపై దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "సత్యం చివరకు గెలుస్తుంది. ధర్మం వైపు నిలబడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు



**స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన లోకేశ్**
**శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక ఆశీస్సులు పొందిన మంత్రి దంపతులు**
**ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు, స్థానిక నాయకులు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి బ్రహ్మణి పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న లోకేశ్, బ్రహ్మణి దంపతులకు దేవస్థానం




అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. కార్యక్రమం ముగిశాక వేద పండితులు మంత్రి దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ పవిత్రమైన కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంగళగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు: విజయసాయిరెడ్డి

**ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు మన క్రియేటర్లను దోచుకుంటున్నాయన్న విజయసాయి**
**ఇన్‌స్టాగ్రామ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మండిపాటు**
**మనకు ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉండాలని వ్యాఖ్య**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



సోషల్ మీడియా వేదికలపై రాత్రింబవళ్లు శ్రమించి కంటెంట్‌ను సృష్టిస్తున్న భారతీయ క్రియేటర్లకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వాడుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటున్నాయని మండిపడ్డారు. యూట్యూబ్ వంటి సంస్థలు ప్రకటనల ఆదాయంలో 55 శాతం క్రియేటర్లకు ఇస్తుండగా, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు క్రియేటర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విదేశీ సంస్థలు తమ ధోరణిని మార్చుకోని పక్షంలో, భారతదేశానికే సొంతంగా ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉండాలని ఆయన ప్రతిపాదించారు. 'భారత్ టాకీస్' లాంటి స్వదేశీ ప్రత్యామ్నాయాల మాదిరి, ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉంటే మన దేశ సంపద విదేశాలకు పోకుండా ఉండటమే కాకుండా, క్రియేటర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో అశ్వినీ వైష్ణవ్ క్రియేటర్ల పక్షాన మాట్లాడిన విషయాన్ని గుర్తుచేస్తూ, వారి ఆర్థిక భద్రత, హక్కుల కోసం కఠినమైన చట్టబద్ధ నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ క్రియేటర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియాలో క్రియేటర్లే వెన్నెముక అని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## నెల్లూరు జిల్లాలో వింత ఘటన..

**పాముతో ఆసుపత్రికి వచ్చిన యువకుడు!**
**నెల్లూరు జిల్లా కోవూరులో ఘటన**
**హోటల్‌లో భోజనం చేస్తుండగా యువకుడికి పాముకాటు**
**కరిచిన పామును చంపి ఆసుపత్రికి తీసుకెళ్లిన బాధితుడు**
**వైద్యులకు చూపించేందుకే అలా చేశానని వెల్లడి**



**నెల్లూరు, జై భీమ్ న్యూస్**

నెల్లూరు జిల్లా కోవూరులో ఓ వింత ఘటన స్థానికంగా కలకలం రేపింది. పాముకాటుకు గురైన ఓ యువకుడు, కరిచిన పామును చంపి చేత్తో పట్టుకుని ఆసుపత్రికి రావడంతో అందరూ ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెల్లూరు శివారులోని భగత్ సింగ్ కాలనీకి చెందిన వలీ అనే యువకుడు నిన్న మధ్యాహ్నం భోజనం కోసం కోవూరులోని ఓ హోటల్‌కు వెళ్లాడు. అతను భోజనం చేస్తున్న సమయంలో ఓ రక్తపింజరి పాము కాటు వేసింది. దీంతో వెంటనే అప్రమత్తమైన వలీ, ఆ పామును చంపేశాడు. అనంతరం ఏమాత్రం ఆలస్యం చేయకుండా చంపిన పామును తీసుకుని నేరుగా కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి (సీహెచ్‌సీ) వెళ్లాడు. పాముతో సహా ఆసుపత్రిలోకి వచ్చిన యువకుడిని చూసి అక్కడి సిబ్బంది, రోగులు భయపడ్డారు. వెంటనే తేరుకున్న వైద్య సిబ్బంది, అతడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. తనను ఏ పాము కరిచిందో వైద్యులకు స్పష్టంగా చూపిస్తే, సరైన చికిత్స అందిస్తారనే ఉద్దేశంతోనే ఆ పామును వెంట తెచ్చినట్లు వలీ ఆసుపత్రి సిబ్బందికి తెలిపాడు. యువకుడు పామును తీసుకుని ఆసుపత్రికి వెళుతున్న దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది.

## జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**కూటమి ప్రభుత్వంపై విమర్శలు**
**జోగి రమేశ్ ఇంటిపై దాడులు జరుగుతుంటే పోలీసులు సైలెంట్ గా ఉన్నారన్న బుగ్గన**
**నేరస్తులకు రక్షణ కల్పిస్తున్నారా అని ప్రశ్న**
**అంబటిపై తప్పుడు కేసులు పెట్టారని మండిపాటు**
**అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్య**
**చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలని సూచన**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**




రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్ఠకు చేరాయని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి వెళ్లిన బుగ్గన ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిం చడమే కాకుండా, దాడులు చేసే వారికి ఎస్కార్ట్ ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేక నేరస్థులకు రక్షణ కల్పిస్తు న్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ దాడులను మహిళలు ముందుండి నడిపించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నడూ చూడని కొత్త సంస్కృతి అని ఆయన అన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడించడం, దాడులు చేయిం చడం వెనుక పెద్దల 'కోచింగ్' ఉందని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని బుగ్గన తప్పుబట్టారు. బాధితులపైనే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాల రాజకీయ అను భవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయో గించాలి కానీ, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడానికి కాదని అన్నారు.

## కళ్లు చెదిరేలా 'విరోష్' జంట సంగీత్ వేడుక

**ఇటీవల పెళ్లితో ఒక్కటైన విజయ్ దేవరకొండ-రష్మిక**
**తాజాగా సంగీత్ ఫొటోలు విడుదల**
**ఆ రాత్రి తాము ఆపకుండా డ్యాన్స్ చేస్తూనే ఉన్నామని రష్మిక వెల్లడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహ వేడుకలు ముగిసినా, ఆ సందడి ఇంకా కొనసాగుతూనే ఉంది. 'విరోష్' జంటగా అభిమానులు పిలుచుకునే ఈ ఇద్దరూ, తాజాగా తమ సంగీత్ వేడుకకు సంబంధించిన అద్భుతమైన ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతూ ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటున్నాయి. ఫిబ్రవరి 24న ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్ వేదికగా ఈ సంగీత్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఆ రాత్రి ప్రేమ, ఆనంద బాష్పాలు, నవ్వులు, సంగీతం, మెరుపులతో నిండిపోయిందని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఆ రాత్రి మేం ఆపకుండా డ్యాన్స్ చేస్తూనే ఉన్నాం. నా జీవితంలోనే అది అత్యంత ఫన్‌తో కూడిన రాత్రి" అని రష్మిక రాసుకొచ్చారు. ఈ వేడుకలో తామిద్దరం ఒకరికొకరు సర్ ప్రైజ్ లు ప్లాన్ చేసుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు కూడా తమ కోసం డ్యాన్స్ చేసి ఆశ్చర్యపరిచారని ఆమె తెలిపారు. సంగీత్ వేడుకలో రష్మిక షిమ్మరింగ్ లెహంగాలో మెరిసిపోగా, విజయ్ రాయల్ అవుట్‌ఫిట్‌లో కనిపించారు. రష్మిక మొదట ఆనంద్ దేవరకొండతో స్టెప్పులేయగా, ఆ తర్వాత విజయ్ ఆమె కోసం స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. చివరగా విరోష్ జంట చేసిన రొమాంటిక్ డ్యాన్స్ ఈ వేడుకకే హైలైట్‌గా నిలిచింది. కాగా, ఫిబ్రవరి 26న వీరి వివాహం జరగగా, మార్చి 4న హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మళ్లీ ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే..

**ఆలయంలో కేశినేని చేతి నుంచి పట్టువస్త్రాలు లాక్కున్న కొలికపూడి**
**నెమలి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో ఘటన**
**ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట**
**అధిష్ఠానం జోక్యం చేసుకున్నా వీడని నేతల మధ్య విభేదాలు**



**విజయవాడ, జై భీమ్ న్యూస్**

విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. టీడీపీ అధిష్ఠానం జోక్యం చేసుకున్నా చక్కబడని ఈ వివాదం, తాజాగా దైవ సన్నిధిలో ప్రొటోకాల్ రచ్చకు దారితీసింది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎంపీ చేతిలో ఉన్న పట్టువస్త్రాలను ఎమ్మెల్యే కొలికపూడి బలవంతంగా లాక్కోవడం హాట్ టాపిక్ అయింది. నిన్న రాత్రి జరిగిన స్వామివారి కల్యాణానికి ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి తమ సతీమణులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా, స్వామివారికి సమర్పించే పట్టువస్త్రాలను ఆలయ పురోహితులు ఎంపీ చిన్ని దంపతులకు అందజేశారు. అయితే, తనకు కూడా వస్త్రాలు ఇవ్వాలని ఎమ్మెల్యే పట్టుబట్టారు. ప్రొటోకాల్ ప్రకారం ఒకరికే ఇస్తారని చెప్పిన ఆలయ అధికారులు, ఆయనకు తలంబ్రాలు అందించారు. దీంతో అసంతృప్తికి గురైన ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చేతిలోని పట్టువస్త్రాలను బలవంతంగా లాక్కుని తన తలపై పెట్టుకున్నారు. ఈ అనూహ్య పరిణామంతో అక్కడున్న భక్తులు నివ్వెరపోయారు. ఎంపీ వర్గీయులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, తోపులాటకు దారితీసింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఎంపీ కేశినేని చిన్ని తన వర్గీయులను వారించి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అనంతరం కల్యాణ మండపంలో ముందు వరుసలో ఎమ్మెల్యే దంపతులు, వెనుక వరుసలో ఎంపీ దంపతులు కూర్చున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

## ఏపీ లిక్కర్ కేసు... నేపాల్ సరిహద్దుల్లో ప్రణయ్ ప్రకాశ్ అరెస్ట్

**స్కామ్‌లో ఏ-52గా ఉన్న ప్రణయ్ ప్రకాశ్**
**నేపాల్ సరిహద్దుల్లోని సోనౌలీ చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్**
**విజయవాడకు తరలిస్తున్న సిట్ అధికారులు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణంలో మరో అరెస్ట్ జరిగింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరిగా భావిస్తున్న కట్టా ప్రణయ్ ప్రకాశ్‌ను నేపాల్ సరిహద్దుల్లోని సోనౌలీ చెక్‌పోస్ట్ వద్ద సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ స్కామ్‌లో ప్రణయ్ ప్రకాశ్ ఏ–52 నిందితుడిగా ఉన్నారు. లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న అతడిని పక్కా సమాచారంతో పట్టుకున్న పోలీసులు, స్థానిక మహారాజ్ గంజ్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తరలిస్తున్నారు. కట్టా ప్రణయ్ ప్రకాశ్ అరెస్టుతో ఈ కుంభకోణంలోని మనీ లాండరింగ్ కోణంపై మరిన్ని ఆధారాలు లభించే అవకాశం కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును భద్రపరచడం, రవాణా చేయడంలో ప్రణయ్ కీలక పాత్ర పోషించినట్లు సిట్ ఇప్పటికే గుర్తించింది. ప్రణయ్ అరెస్టుతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 17కు చేరింది. ఇటీవలే ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి (ఏ2), ముప్పిడి అవినాశ్ రెడ్డి (ఏ7) వంటి కీలక వ్యక్తులను ఇటీవల సిట్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు ప్రణయ్‌ను విజయవాడకు తీసుకువచ్చిన తర్వాత కస్టడీలోకి తీసుకుని విచారిస్తే, ఈ స్కామ్ వెనుక ఉన్న మరికొందరు పెద్దల పేర్లు, విదేశాలకు తరలిన నిధుల వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## రూ.100 కోట్ల ఆలయ భూమి కబ్జా అయింది: గుడివాడ అమర్నాథ్

**అనకాపల్లిలోని కన్యాకాపరమేశ్వరి ఆలయ భూమి కబ్జా అయిందన్న గుడివాడ**
**చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక దొంగల ముఠా ఏర్పడిందని ఆరోపణ**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేసే నేతలు, కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చెందిన భూములు అక్రమంగా బదలాయించారంటూ ఆయన మండిపడ్డారు. వందేళ్ల క్రితం దాతలు కన్యకాపరమేశ్వరి ఆలయానికి 2 ఎకరాల 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారని... అందులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కోసం కొంత తీసుకోగా, మిగిలిన 1 ఎకరా 11 సెంట్ల స్థలం ప్రస్తుతం ఉందని అమర్నాథ్ తెలిపారు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని ఆయన వెల్లడించారు. దేవాదాయ శాఖకు చెందిన ఈ విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అధికారం అధికారులకు ఎక్కడిదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ప్రైవేట్ స్థలంగా చూపుతూ అధికారులు ఏ ప్రాతిపదికన నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒక 'దొంగల ముఠా' ఏర్పడిందని, కూటమి నేతల అండతో ప్రభుత్వ, దేవాదాయ భూములను ఈ ముఠా దోచుకుంటోందని ఆరోపించారు. రూ.100 కోట్ల విలువైన ఈ భూమి ఇప్పటికే కౌలుదారుల పేరు మీదకు మారిందని, ఈ భారీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా



# తమిళ నటి దేవీప్రియకు తప్పిన ప్రమాదం.. డ్రైవర్ దుర్మరణం

**బుల్లితెర నటి దేవిప్రియ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం**
**టైరు పంక్చర్ కావడంతో మారుస్తుండగా ఘటన**
**గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ అక్కడికక్కడే మృతి**
**నటి దేవిప్రియ సురక్షితం, ఆమె సహాయకుడికి గాయాలు**

తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ బుల్లితెర నటి దేవిప్రియ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనలో ఆమె కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె సహాయకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెరంబలూర్ జిల్లా సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నటి దేవిప్రియ (47) తన సహాయకుడు బి. దివాకర్ (46)తో కలిసి కారులో చెన్నై నుంచి థేని జిల్లాకు బయలుదేరారు. డ్రైవర్ డి. ముత్తుగణేశ్ (38) కారు నడుపుతున్నారు. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిపై ఇరూర్ సమీపంలోకి రాగానే కారు టైరు పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ ముత్తుగణేశ్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి టైరు మారుస్తుండగా, వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారి కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ముత్తుగణేశ్ అక్కడికక్కడే మరణించారు. కారు పక్కనే నిలబడి ఉన్న దేవిప్రియ త్రుటిలో తప్పించుకోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమె సహాయకుడు దివాకర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తూ, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా శిరీష్, నయనికా ప్రీ వెడ్డింగ్ వేడుక.. తరలివచ్చిన టాలీవుడ్

**అల్లు శిరీష్, నయనికాల వివాహ వేడుకలు ప్రారంభం**
**ఈ నెల 6న పెళ్లి.. ఘనంగా జరిగిన ప్రీ వెడ్డింగ్ రిసెప్షన్**
**అన్నగా బాధ్యతలు నిర్వర్తించిన అల్లు అర్జున్**
**అయ్యప్ప మాలలో హాజరైన రామ్ చరణ్.. ప్రత్యేక ఆకర్షణగా బాలకృష్ణ**



టాలీవుడ్‌లో మరో మెగా కుటుంబ వేడుకకు రంగం సిద్ధమైంది. అల్లు వారింట పెళ్లి సందడి మొదలైంది. ప్రముఖ నటుడు అల్లు శిరీష్, నయనికాల వివాహం మార్చి 6న జరగనుండగా, నిన్న రాత్రి హైదరాబాద్‌లో ప్రీ వెడ్డింగ్ రిసెప్షన్ వైభవంగా జరిగింది. సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల రాకతో ఈ వేడుక ఘనంగా జరిగింది. సంప్రదాయం, ఆధునికత మేళవించిన అలంకరణలతో వేదిక కనులవిందు చేసింది. సోదరుడి వివాహ వేడుక కావడంతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అన్ని ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. వేడుకకు వచ్చిన ప్రతి అతిథిని పేరుపేరునా ఆత్మీయంగా పలకరిస్తూ అన్నగా తన బాధ్యతను నిర్వర్తించారు. ఆయన అర్ధాంగి స్నేహా రెడ్డి కూడా సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అతిథులతో ముచ్చటిస్తూ కనిపించారు. ఈ వేడుకకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అయ్యప్ప మాలలో హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ రిసెప్షన్‌లో మరో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. నందమూరి బాలకృష్ణ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఒకేచోట కూర్చుని సరదాగా ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. వీరిద్దరి మధ్య నవ్వులు అక్కడి వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చాయి. వీరితో పాటు కింగ్ నాగార్జున, ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు, నాని, సాయి ధరమ్ తేజ్ వంటి అగ్ర తారలు హాజరై సందడి చేశారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం తనదైన శైలిలో నవ్వులు పూయించారు. దర్శకుడు బుచ్చిబాబు సన, హీరో శ్రీ విష్ణు, నటుడు అలీ, యాంకర్ సుమ కనకాల వంటి పలువురు ప్రముఖులు కూడా హాజరై కాబోయే వధూవరులు శిరీష్-నయనికా జంటకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే వేదికపై టాలీవుడ్ తారలంతా మెరవడంతో ఈ వేడుక తారల సమ్మేళనాన్ని తలపించింది. అద్భుతమైన అలంకరణ, ప్రముఖుల రాకతో ఈ రిసెప్షన్ ఈ ఏడాది జరిగిన అత్యంత వైభవమైన వేడుకల్లో ఒకటిగా నిలిచింది. ఈ నెల 6న జరగనున్న వీరి వివాహం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# తన జీవితంలో చోటుచేసుకున్న చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్న స్నేహ

**వరుస సినిమాలు చేస్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యానన్న స్నేహ**
**లేచి నిలబడాలన్నా 8 నెలల సమయం పడుతుందని డాక్టర్లు చెప్పారన్న స్నేహ**
**కెరీర్ ముగిసనట్టే అని అనుకున్నానని వెల్లడి**

తెలుగు వెండితెరపై తనదైన అభినయంతో హోమ్లీ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి స్నేహ, తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒక భయంకరమైన ప్రమాదం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన ఈమె, అంతకుముందే ఒకానొక దశలో తన సినీ ప్రయాణం ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడించారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో జరిగిన ఒక ఘోర ప్రమాదం తన జీవితాన్ని తలకిందులు చేసిందని, ఆ సమయంలో పడిన వేదనను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ప్రమాదంలో కాళ్లు, చేతులు, వీపు భాగానికి తీవ్రమైన గాయాలయ్యాయని స్నేహ తెలిపారు. కనీసం మంచం మీద నుండి లేచి నిలబడాలన్నా ఎనిమిది నెలల సమయం పడుతుందని వైద్యులు చెప్పడంతో, ఇక తను కెమెరా ముందుకు రావడం అసాధ్యమని అనుకున్నానని చెప్పారు. సరిగ్గా అదే సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ 'పార్థిబన్ కనవు' (తెలుగులో 'అంజలి ఐ లవ్యూ') కథతో ఆమెను సంప్రదించారు. తాను కదల్లేని స్థితిలో ఉన్నానని తెలిసినా, ఆ దర్శకుడు చూపిన నమ్మకం, ఇచ్చిన ప్రోత్సాహం తనలో కొత్త ఆశలు చిగురింపజేశాయని స్నేహ తెలిపారు. ఆ మొండి ధైర్యంతోనే కోలుకుని మళ్లీ మేకప్ వేసుకున్నానని, ఆ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పిందని ఆమె వివరించారు.